హతుడు - హంతకుడు

కె. బి. ఎస్. కుమార్

మరోసారి టైమ్ చూసుకున్నాడు డిటెక్టివ్ జలంధర్.

పదిగంటలు దాటి ఐదు నిముషాలు కావొస్తూంది. 'ఈ అమ్మాయి ఇంకా రాలేదేమిటి చెప్మా?' అనుకున్నాడు మనసులోనే. అసహనంగా అటూ యిటూ కదిలాడు.

'...తను పొరపాటుగా విన్లేదు కదా!...ఊహుఁ... ఏ విషయాన్నైనా ఒక్కసారి వింటేచాలు. నిద్దరలో లేపిఅడిగినా అక్షరమ్ముక్క పొల్లు పోకుండా కరక్టుగా చెప్పెయ్యగలడు తను...మరైతే పదిగంటలు దాటినా ఆమె యింకా ఎందుకు రాలేదు??

ఎంత ఆలోచించినా అంతు చిక్కలేదు. ఈ ఉదయం జరిగింది అతని మస్తిష్కంలో లీలగా మెదిలింది.

ఆ ఉదయం...

సరిగ్గా ఎనిమిది గంటలకి ఫోను మోగింది. రిసీవరు తనే ఎత్తాడు. ఎవరో అమ్మాయి మాట్లాడుతూ తనతో ఏదో రహస్యంగా మాట్లాడాలనీ సరిగ్గా పదిగంటలకి 'హోటల్ ఎవరెస్ట్'లో 99 వ రూములో తనకోసం వెయిట్ చెయ్యమనీ, ఆ రూమ్ తన పేర బుక్ చేశాననీ, వివరాలు వచ్చాక చెబుతాననీ చెప్పేసి గబుక్కున ఫోన్ పెట్టేసింది.

ఆ అమ్మాయెవరు? ఎలా వుంటుంది?

హోటల్ ఎవరెస్ట్ అంటే మామూలు వాళ్ళు బస చేసేది కాదు. అక్కడ ఒక్కొక్క రూముకి ఒక్కొక్క రోజుకి అద్దె అయిదు వందల రూపాయలు!!

అయిదు వందలంటే మాటలుగాదు. అదీ ఒక్క రోజుకి! అంటే ఆమె బాగా కలవారింటమ్మాయి అయి వుండాలి.

...'టక' 'టక' మని తలుపు చప్పుడు కావటంతో ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు డిటెక్టివ్ జలంధర్. తాగుతోన్న సిగరెట్ ని క్రింద పడవేసి బూటుకాలితో నలిపి, లేచి వెళ్ళి తలుపు తెరిచాడు.

మెరుపు తీగలాంటమ్మాయి గభాలున లోనికొచ్చి వెంటనే తలుపు మూసేసింది. తృప్తిగా గాలి పీల్చుకొని "నేనే మీకు ఫోన్ చేశాను" అంది.

ఆమె నోసారి పరిశీలనగా చూశాడు జలంధర్.

వయసు ఇరవై-ఇరవై రెండు మధ్య వుండొచ్చు. వయసుకి తగ్గ ఎత్తు, ఎత్తుకి తగ్గ లావు. ఇంకా పెళ్ళి కాలేదు. మనిషి తెల్లగా, ముట్టుకుంటే మాసి పోయేలా వుంది.

నడుం క్రిందికి వ్రేలాడుతోన్న జడ. నొక్కులజుత్తు. తీర్చి దిద్దినట్టున్న కనుబొమలు. కోటేరులాంటి ముక్కు, సన్నని పెదాలు, పల్చని నిండైన లేత బుగ్గలు. శంఖం లాంటి మెడ, నల్లని చీర, నల్లని జాకెట్ వేసుకున్నందున మరింత తెల్లగా అవుపిస్తోంది.

మొత్తంమీద ఏ చిత్రకారుడో ప్రత్యేక శ్రద్ధతో అత్యంత సుందరంగా గీచిన రేఖా చిత్రంలావుందా అమ్మాయి.

చేష్టలుడిగి నిల్చుండి పోయాడు జలంధర్ - 'ఈ అమ్మాయికి ఓ డిటెక్టివ్‌తో రహస్యంగా మాట్లాడాల్సినంత అవసరం ఏం వచ్చిందా?' అని తలపోస్తూ.

యాంత్రికంగా ఆమెతోపాటు నడిచి కుర్చీలో కూర్చున్నాడు.

"ఇక చెప్పనా?" అందామె మళ్ళీ.

"చెప్పండి..." అన్నాడు జలంధర్ తనలోని ఆశ్చర్యపు తాలూకు భావాలని ప్రక్కకు నెట్టడానికి ప్రయత్నిస్తూ.

"...నేనో అబ్బాయిని ప్రేమిస్తున్నాను. పేరు ప్రవీణ్ బాబు. రెండు రోజులుగా అతను కన్పించటం లేదు. అతనెక్కడున్నాడో కనుక్కొని నాకుచూపాలి. అడ్వాన్సుగా మీ ఫీజులో యిది జమ కట్టుకోండి." కుడి చేతిలోని వ్యానిటీ బ్యాగ్‌లోంచి ఓ కట్టతీసి టేబుల్‌పై పెట్టిందామె.

జలంధర్ కళ్ళు జిగేలుమన్నాయి. అది వందరూపాయల నోట్లకట్ట. అంటే పదివేల రూపాయలన్నమాట.

"...మా నాన్నగారు గొప్ప బిజినెస్ మ్యాగ్నెట్.

'శాంతీ ఎలెక్ట్రికల్ గూడ్స్ మ్యానుఫాక్చరింగ్ కంపెనీ' ప్రొప్రైటర్ త్రివిక్రమరావుగారి పేరు మీరు వినే వుంటారు. ఆయనే మా ఫాదర్. 'రేఖా సూయింగ్ ఫ్యాక్టరీ' మాదే! 'హోటల్ త్రివిక్రమ్' ఓనర్ మా నాన్నగారే! విక్రమార్క ఆర్ట్ పిక్చర్స్ ఫిలిమ్ బ్యానర్, విక్రమార్క మోషన్ ఫిల్మ్ డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీ కూడా మావే...మా నాన్నగారు మీకు తెలుసను కుంటాను" ఒక్క క్షణం ఆగిందామె.

"తెలీక పోవడమేమిటి? పోయిన్నెల్లో మీ విక్ర మార్క ఆర్ట్ పిక్చర్స్ పతాకం క్రింద మీ నాన్నగారు నిర్మిస్తోన్న తొమ్మిదో చిత్రానికి కెమెరా ఆన్ చేసింది నేనే! చిత్రం పేరు 'ఓ ప్రేమ కథ' అనుకుంటాను."

"కరెక్ట్...అప్పుడు నేను కలకత్తాలో మా చిన్నాన్న గారి వద్ద వున్నాలెండి. మా నాన్నగారు మీకు బాగా తెలుసని నాకు తెల్సు. మా నాన్నగారికి యివికాక యింకా ఎన్నో చిన్న చిన్న వ్యాపారాల్లో పార్ట్నర్ షిప్పులున్నాయి. వీటన్నిట్నీ మేనేజ్ చెయ్యటానికి మేనేజర్లున్నారు. వీళ్ళందరికీ పెద్ద ప్రవీణ్ బాబు."

"అంటే జనరల్ మేనేజరన్నమాట."

"అవును."

"అతన్ని గురించి చెప్పండి."

"చెప్తాను...దాదాపు నాకు పదకొండు-పన్నెండేండ్ల వయసున్నప్పుడు ప్రవీణ్ మాయింటికొచ్చాడు. తను అనాథనయ్యానని తండ్రి బ్రతికున్నప్పటివరకూ పియూసీ కంటే ఎక్కువ చదవలేక పోయానని. ఇక చదివే స్తోమత లేదని తనకున్న ఫ్యాక్టరీల్లో ఏదైనా వుద్యోగం

యిప్పించమని మా నాన్నగార్ని ప్రాధేయపడి అడిగాడు.

జాలి గుండెగల మా నాన్నగారు అంగీకరించారు. ఉద్యోగం యిచ్చారు.

"ఉద్యోగం చేసుకుంటూ రాత్రిపూట చదువుకొనేవాడు ప్రవీణ్. చదువుపట్ల అతనికిగల శ్రద్ధ గమనించి మా అమ్మగారు అతన్ని చదువుకోమని ప్రోత్సహించారు. అమ్మద్వారా అతని విషయాలు విన్న మా నాన్నగారు సంతోషపడి స్వంత ఖర్చుతో ఎమ్మెస్సీ వరకూ చదివించారు.

"తన చదువుకి కారణం మా అమ్మగారేనని ఆమెని ఆప్యాయంగా 'అక్కయ్యా' అని పిలిచేవాడు ప్రవీణ్. తప్పిపోయిన తన తమ్ముడే ఆరూపంలో వచ్చాడనుకొని మా అమ్మగారూ అతన్ని ఆదరంగా చూసేవారు. చదువు పూర్తయ్యాక..."

"మిమ్మల్ని ప్రేమించాడా?"

"లేదు. మా నాన్నగారు అతన్ని మా వ్యాపారా లన్నిటికీ జనరల్ మేనేజర్‌గా నియమించారు. ప్రవీణ్ నన్నేనాడూ కోరలేదు. కాని అందమూ, అందాన్ని మించిన తెలివితేటలూ, వాటిని మించిన సమయస్ఫూర్తీ చురుకుదనమూ, అన్నిట్నీ మించిన పాల నురుగులాంటి స్వచ్ఛమైన అతని మనసూ నా హృదయాన్ని లాక్కున్నాయ్! నాకు తెలీకుండానే నా మనసు అతని కంకితమైంది'.'

"ఈ విషయం అతనికి తెల్సా?"

"అప్పుడే తెలీదు. మా అమ్మను 'అక్కయ్యా' అని

పిలుస్తూ మా కుటుంబంలో తనూ ఒకడుగా కలిసి పోయినట్టు అతడు ప్రవర్తిస్తున్నా అతని ఎదుట నిలవాలంటే నా కళ్ళు వణికేవి. ఏదో తెలియని సిగ్గు, భయం ముంచుకు రాగా అతడు కనబడగానే అవతలికి పరుగు తీసేదాన్ని బహుశా దాన్నే "ప్రేమ" అంటారేమో!

'...ఆలోచించి ఆలోచించి" అతన్ని నేను ప్రేమిస్తున్నాను, అని బాగా దృఢ పరచుకున్నాను. అతని అభిప్రాయం కనుక్కోవాలంటే అతన్ని అడగాలి. అడగాలంటే ధైర్యం కావాలి.

"అందుకోసం నేనే అతన్ని పరిచయం చేసుకోక తప్పలేదు. రోజులు గడిచేకొద్దీ భయం తగ్గి క్రమంగా నా కతనివద్ద చనువేర్పడింది. ఇంతలో నా బియస్సీ పూర్తయ్యింది.

మా నాన్న నెలకి మూడు వారాలకిపైగా వూళ్ళు తిరిగేవారు. అమ్మ ఒక్కర్తే వుండేది. అతనితో కలిసి తిరిగినా అమ్మ అపార్థం చేసుకునేది కాదు.

"ఓరోజు నా అభిప్రాయాన్ని అతని ముందుంచి అతని అభిప్రాయంకోసం ఎదురుచూశాను. మొదట బిత్తరపోయాడు. తర్వాత నన్ను మృదువుగా మందలించాడు. నన్ను పెళ్ళిచేసుకుంటే తను నాన్నగారికి ద్రోహం చేసిన వాడౌతాడని, ఇంతకాలం పెంచి పెద్ద చేసి చదువు చెప్పించి ఎంతో ఆప్యాయంగా చూసిన ఆ దంపతులకి అన్యాయం చేసినవాడనౌతానని, తిన్నయింటి వాసాలు లెక్కపెట్టాడనే నింద తనకి తప్పదని ఆ వుద్దేశ్యం మానుకోమని చెప్పాడు.

"నేను ససేమిరా అన్నాను. ప్రవీణ్‌కి కోపం

వచ్చింది. ఆరోజు సాయంత్రమే ఈ విషయం గురించి మా అమ్మతో మాట్లాడటానికి పూనుకున్నాడు.

"ఆరోజు మా నాన్నగారు ఊళ్ళో లేరు. 'అమ్మాయి బియస్సీ పూర్తయిందిగా, సంబంధాలేమైనా చూస్తు న్నారా...?' అనే వాక్యంతో సంభాషణ మొదలు పెట్టాడు. కాసేపు మాట్లాడాక మా అమ్మ మాట విని తెల్లబోయాడు.

"తమ్ముడివి నువ్వుండగా అమ్మాయికి మరో సంబంధం ఎందుకు?" యిదీ మా అమ్మ అభిప్రాయం!

"ఏదో చెప్పబోయాడు. మా అమ్మ విన్పించుకోలేదు. ప్రవీణ్‌లో తన తమ్ముణ్ణి చూసుకుంటోంది మా అమ్మ. మా నాన్నగారితో తనే మాట్లాడి ఒప్పిస్తానంది. ప్రవీణ్ అభిప్రాయం అడిగింది...ఒప్పుకున్నాడు.

"నా ఆనందానికి ఏదీ ఆనకట్టు వేయలేకపోయింది. మా అమ్మ నన్ను చిన్నాన్నవద్దకి వెళ్ళమని, నాన్నగారు వచ్చాక ఒప్పించి పిలిపిస్తానని చెప్పింది. ఆ సమయంలో నేనుండటం మంచిదికాదు. మా నాన్న అభిప్రాయం ఎలా వుంటుందో మరి!

"సరే నన్నాను. కలకత్తా వెళ్ళిపోయాను.

"పదిహేను రోజులక్రితం యింటినుండి టెలిగ్రామ్ వచ్చింది. నాన్నగారూ ఒప్పుకున్నారని తెలిసి రెక్కలు గట్టుకువాలాను అలవి మీరిన ఆనందంతో.

"మా అమ్మ, నాన్న చాల సంతోషంగా కన్పిం చారు. రెండ్రోజులయ్యాక మా యింట్లో ఓ పార్టీ అరేంజ్ చేసి అందరి ఎదుటా మా యిద్దరి వివాహ విష యాన్ని ప్రకటించారు మా నాన్నగారు.

"ఆ సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్‌లో స్వచ్ఛమైనగాలి పీలుస్తూ అంతకంటే స్వచ్ఛమైన ప్రవీణ్ కబుర్లు వింటూ పవిత్రమైన అతని ఒడిలో తృప్తిగా విశ్రాంతి తీసుకున్నాను. నా అదృష్టానికి నేను పొంగిపోయాను.

"వారంక్రితం కట్టుమిషన్ల ఫ్యాక్టరీలో వాటిని తయారుచేసే ఓ యంత్రం ట్రబులిచ్చింది. చెక్ చెయ్యగా అందులో ఓ పార్టు విరిగిపోయిందనీ అది బొంబేలో మాత్రమే దొరుకుతుందనీ చెప్పారు. మరురోజే మా నాన్నగారు ప్రవీణ్‌ని పంపించారు ప్లేన్‌లో.

"రెండు రోజులతర్వాత ఆ పార్టు దొరికిందని, రేపు బయల్దేరుతున్నానని ప్రవీణ్ దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చింది. అతనికోసం కళ్ళలో వత్తులు వేసుకొని ఎదురు చూశాను.

"మరుసటి రోజు—అంటే మొన్న రాత్రి తలుపు టక టకమని విన్పించటంతో స్వయంగా నేనే వెళ్ళి తలుపు తెరిచాను. ఆశ్చర్యంతో, భయంతో, బాధతో కంపించిపోయాను.

"ఎదురుగా నేలమీద యంత్రానికి కావలసిన భాగం మాత్రమే వుంది. ఎవరూ లేరు. గబ గబా బయటకు పోయి చూశాను. ఎవరూ కన్పించలేదు!

"ప్రవీణ్ ఎందుకలా చేశాడు? పార్టు తీసుకొని యింటి వరకూ వచ్చినవాడు తలుపు తట్టికూడా తలుపు తెరిచే వరకూ ఎందుకు వుండలేకపోయాడు? పార్టు బయట పెట్టి వచ్చేలోగా కన్పించకుండా పోవటం ఏమిటి?

"ఆ పార్టు మాయింటి ముందుంచింది ప్రవీణేనా?... అసలు ప్రవీణ్ బొంబేనుండి తిరిగొచ్చాడా? వస్తే ఈ

ఊళ్ళో ఎక్కడున్నాడు? రాకపోతే బొంబేలో ఏమయ్యాడు?...యివే మీరు తెల్సుకోవలసినవి..."

చెప్పటం ముగించి దీర్ఘంగా నిట్టూర్చిందా అమ్మాయి.

"ప్రస్తుతం మీ నాన్నగారు ఊళ్ళో లేరా?" అడిగాడు డిటెక్టివ్ జలంధర్.

"లేరు. ప్రవీణ్ దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చిన రోజే ఆయన వూరికి వెళ్లారు. 'ఓ ప్రేమకథ' ప్రస్తుతం 'కులు వ్యాలి'లో అవుట్ డోర్ షూటింగులో వుంది. అక్కడుంటారు. తిరిగొచ్చేసరికి పదిరోజులు పట్టొచ్చు. అమ్మ నాతో అసలు మాట్లాడటంలేదు. దయచేసి మా నాన్నగారు తిరిగొచ్చేలోగా మీరీ కేసు పరిశోధించాలి. ఖర్చుకి వెనకాడకండి. ఆఁ...మరో ముఖ్య విషయం. మీరీ కేసు ఇన్వెస్టిగేట్ చేస్తున్నట్టు మా నాన్నగారికిగాని మా వ్యాపారాలకి సంబంధించిన మరెవరికిగాని తెలియపరచకండి..."

"అలాగే..." సిగరెట్ దమ్ము ఘాటుగా లాగుతూ ఏదో ఆలోచిస్తున్నాడు జలంధర్ ఆమె కళ్ళు తుడుచుకోటాన్ని ఓరగా గమనిస్తూ.

"ప్రవీణ్ మిమ్మల్నెన్నడూ కోరలేదని అన్నారు. అతను మరో అమ్మాయితో తిరుగుతున్నట్టుగాని ఆడపిల్లల్తో స్నేహం చేసినట్టుగాని మీకేమైనా తెల్సా?"

"లేదు. అతనేనాడూ ఎవర్నీ ఆ దృష్టితో చూడలేదు. నాకు తెల్సినంతవరకూ అతనికి గర్ల్‌ఫ్రెండ్స్ కూడా ఎవరూ లేరు."

"యిలా అడుగుతున్నానని మరోలా అనుకోకండి.

మీ కెవరేనా బోయ్‌ఫ్రెండ్సున్నారా?"

"లేరు. నాతో మాట్లాడటానిక్కూడ ఎవరూ సాహసించరు."

"ప్రవీణ్ మీ యింట్లోనే వుండేవాడా?"

"అవును."

"అతని కెవరేనా శత్రువులున్నారా?"

"ఆడపిల్లని. అలాంటివన్నీ నాకెలా తెలుస్తాయి? మేనేజర్లందరికీ మేనేజరు. అందరికీ తలలో నాలుకగా వుండేవాడు. అంతఃశత్రువు లెవరేనా వున్నారేమో!"

"అతని ఫొటో వుందా మీవద్ద?"

మౌనంగా తీసిచ్చింది.

"మీ అడ్రస్ ఇవ్వండి" ఫొటోనే చూస్తూ అన్నాడు.

ఆ అమ్మాయి చెప్పినట్టుగానే చాల అందంగా వున్నాడు ప్రవీణ్.

"తీసుకోండి..." అడ్రస్‌గల కాగితం డిటెక్టివ్ చేతిలో పెట్టిందా అమ్మాయి.

'మిస్ కాంతిరేఖ; డాటరాఫ్ యస్. త్రివిక్రమరావు, కాంతీసదన్, నవీన్ నగర్, హైదరాబాదు...' ఒక్కసారి చదివి మడిచి జేబులో పెట్టుకుంటూ "ఆల్ రైట్ మిస్ కాంతిరేఖా! ప్రవీణ్‌బాబుని వెదికే ప్రయత్నం ఈరోజునుండే మొదలెడతాను. మీరు దిగులు మానండి. అవసరమైతే మళ్ళీ కలుస్తాను."

చేతులు జోడించి, సెలవు తీసుకొని గబగబా నడిచి తలుపు తెర్చుకొని వెళ్ళిపోయింది మిస్ కాంతిరేఖ.

ఆమె చెప్పిన విషయాలు ఆలోచిస్తూ అయిదు నిమి

చాలసేపు అలాగే కూర్చుండిపోయాడు డిటెక్టివ్ జలంధర్.

తర్వాత ఆమె టేబిల్‌పై ఉంచి వెళ్ళిన నోట్లను లెక్కపెట్టుకున్నాడు. చివరినోటు లెక్కిస్తూండగా ఏదో చిన్న కాయితం జారిపడింది. క్రిందికి వంగి తీసి అందులోని మేటర్ చదివాడు.

"ప్రేమిస్తే చంపేస్తా!"

అనిమాత్రం వుంది! సంతకం లేదు!!

అవాక్కైపోయాడు జలంధర్!!! ఆమె దగ్గరికీ కాయితం ఎలా వచ్చింది?

ఈ కాయితాన్నామె చూసుకోలేదా? ఆమె నలా బెదిరించటానికి కారణం ఏమిటి? ఎవరు చేసుంటారోపని? కాంతిరేఖ యింతవరకూ చెప్పిందంతా నిజమేనా? లేక ఏదైనా దాస్తోందా? ఆమె తల్లి అలా మారిపోవడాని క్కారణం ఏమిటి?

అంతు తెలియని సమస్యలతో, జవాబులేని ప్రశ్నలతో హోటలు గదినుండి బయటపడ్డాడు జలంధర్!

2

"టాక్సీ...!" గట్టిగా పిలిచాడు ప్రవీణ్‌బాబు. అటుగా పోతోన్న ఓ టాక్సీ అతని ముందాగింది.

"కాంతీసదన్, నవీన్‌నగర్." చెప్పాడు ప్రవీణ్, సీటులో వెనక్కివాలుతూ.

టాక్సీ వేగాన్ని పుంజుకుంది.

జేబులోంచి విల్స్‌ఫ్లేక్ సిగరెట్ తీసి వెల్గించుకున్నాడు ప్రవీణ్‌బాబు.

పది నిమిషాలు గడిచాయి. ఇంజన్ ట్రబుల్ వల్ల టాక్సీ ఆగిపోయింది.

విసుగ్గా వుండిపోయాడు ప్రవీణ్ బాబు. అతని కెప్పుడెప్పుడు కాంతిరేఖని చూద్దామా అని వుంది.

ఆ రోడ్డులో సామాన్యంగా ఖాళీ టాక్సీలు రావు. ఆ ప్రక్క సందులలోగుండా వెళ్ళితే అక్కడికి ఇల్లుదగ్గరే. టాక్సీ దిగి ఫేర్ చెల్లించి నడవసాగాడు.

గబగబా నడుస్తున్నాడు ప్రవీణ్ బాబు. అది చిన్న యిరుకుసందు. ఆ యిరుకు సందులోంచి తిన్నగా ఫర్లాంగు వెడితే మెయిన్ రోడ్ ని కలుస్తుంది. యిల్లు దగ్గరవుతుంది.

తొందరగా కాంతిరేఖని చూడాలనే తపనతో అడ్డదారైన ఆ సందులో నడుస్తున్నాడు ప్రవీణ్ బాబు.

కుర్రాళ్ళు రాళ్ళు విసిరారేమో, వున్న రెండు వీధిలైట్ల బల్బులూ పగిలిపోయాయి. ఓ రకమైన దుర్వాసన వేస్తోంది ఆ సందు.

సగం దూరం నడిచాడో లేదో - ఎవరో 'అమ్మా' అని కేకెయ్యటంతో వెనక్కి తిరిగి ఆ సందులోంచి పాయగా చీలిన మరో సందులోనికి తొంగి చూశాడు ప్రవీణ్ బాబు.

ఎదురుగా కన్పించిన దృశ్యం అతన్ని కంపింపజేసింది.ఒక వ్యక్తిని నలుగురైదుగురు కలిసి ఒకేసారి పొడిచారు కత్తులతో. మళ్ళీ మళ్ళీ పొడుస్తున్నారు. ఆ వ్యక్తి శరీరం చిల్లులు పడింది. రక్తం కాల్వలా పారింది.

ఆ దృశ్యాన్ని చూడలేకపోయాడు ప్రవీణ్. కళ్ళు మూసుకొని 'మైగాడ్!' అన్నాడు అప్రయత్నంగా.

వాతావరణం ప్రశాంతంగా వుండటంతో ఆ మాటలు హంతకుల కర్ణేంద్రియాలకి సోకాయి. ఉలిక్కిపడి ప్రవీణ్ వేపు చూశారు.

మరుక్షణం వాళ్ళ కళ్ళు ఎరుపెక్కి నిప్పులు కక్క నారంభించాయి. జేబుల్లోంచి రివాల్వర్లు తీసి అతనికేసి గురిపెట్టి ఒక్కో అడుగూ ముందుకేస్తూ ప్రవీణ్ వైపు రాసాగారు.

ప్రవీణ్ కి ముచ్చెమటలు పోశాయ్. అయిపోయింది. వాళ్ళు తనని చూశారు. తన ప్రాణం యింకా ఎన్ని క్షణాలుంటుందో వ్రేళ్ళమీద లెక్కపెట్టొచ్చు... ఓ మనిషిని దారుణంగా హత్యచేస్తూండగా తను కళ్ళారా చూశాడు. తనని బ్రతకనిస్తారనుకోటం కల్ల...

ప్రవీణ్ బాబు గుండెలు దడదడ లాడాయ్...

3

"డిటెక్టివ్ గారూ!"...ఆత్రంగా, భయంగా వణుకు తోన్న కంఠస్వరం వినవచ్చింది ఫోనులో. ఆ కంఠం కాంతిరేఖది!!

"నేనే మాట్లాడుతున్నాను. వాట్ హ్యాపెండ్ కాంతిరేఖా?"

"అయిపోయింది జలంధర్ గారూ! అంతా అయి పోయింది..." అంతకంటే ఎక్కువగా మాట్లాడలేక పోయిందామె. అంతవరకూ దాచుకున్న దుఃఖం ఒక్క సారిగా కట్టలు తెంచుకు ప్రవహించింది.

"ఏమైంది కాంతిరేఖా? ఎందుకేడుస్తున్నారు?" లాలనగా అన్నాడు జలంధర్.

"నా ప్రవీణ్...నా ప్రవీణ్ ని...హత్యచేశారు డిటె క్టివ్ గారూ!" భోరుమంది కాంతిరేఖ.

అదిరిపడ్డాడు జలంధర్. ఎన్నో ప్రశ్నలు అతని మస్తి ష్కాన్ని తొలుస్తున్నాయి. "వెంటనే వస్తున్నాను" అని

మాత్రం ఆ సేసి డాడ్జివద్దకు పరిగెత్తాడు.

రాకెట్ వేగంతో కాంతీసదన్ చేరుకుంది డాడ్జి.

కాంతీసదన్ వెలవెలబోతోంది. భయంకర నిశ్శబ్దం విలయతాండవం చేస్తోందక్కడ. నిర్జీవ ప్రతిమలా కూర్చుని వుంది కాంతిరేఖ ఒక్కతే. ఆమె ముఖం అమావాస్య చీకటిలా వుంది. కళ్ళు లావెక్కి జ్యోతుల్లా వున్నాయి.

ఆ నిశ్శబ్దాన్ని భరించలేక పోయాడు జలంధర్. కాంతిరేఖవైపు తిరిగి ఏదో అనబోయాడు. వెక్కుతూనే ఆమె ఓ వైపుకి చేత్తో చూపించి ముఖాన్ని అరచేతుల్తో కప్పుకుంది.

ఆ వేపు దృష్టి సారించాడు డిటెక్టివ్ జలంధర్.

అక్కడో పొడుగాటి పెట్టెవుంది. అది మామూలు పెట్టెకాదు. శవపేటిక!

ఆ పెట్టె తలుపు తెరిచాడు జలంధర్.

లోపల ప్రవీణ్ బాబు శవం వుంది. ఒళ్ళంతా రక్తంతో తడిసి వుంది. రివాల్వర్ తో చంపబడ్డాడు.

పెట్టె తలుపు మూసేసి నెమ్మదిగా కాంతిరేఖ దగ్గరికొచ్చాడు. మృదువుగా ఓదార్పుగా ఆమె భుజం నిమిరాడు.

చల్లగాలికి కరిగించే మేఘమాలికల్లా అయ్యాయి కాంతిరేఖ కళ్ళు.

"ఎవరు తెచ్చారీపెట్టెని?" శాంతంగానే అడిగాడు.

ఏదో మాట్లాడాలని ప్రయత్నించిం దామె. కాని దుఃఖంవల్ల మాటలు పెగల్లేదు.

ఆ అవకాశాన్ని వినియోగించుకున్నాడు డిటెక్టివ్.

అతని ముఖంలో గంభీరత అలముకుంది. "రహస్యాలు దాచటంవల్ల ప్రయోజనం ఏమీ లేదు కాంతిరేఖా! ప్రవీణ్ చనిపోవటానికి ఒకవిధంగా కారణం మీరే!"

చటుక్కున యిటు తిరిగింది కాంతిరేఖ. "నేనా?!" అంది. అంతబాధలోనూ ఆమెకి అంతులేని ఆశ్చర్యం కలిగింది.

"అవును. మీరే! దీన్ని గురించి మీరు మొదటే చెప్పి వుంటే ప్రవీణ్ ప్రాణం దక్కివుండేదేమో!" జేబులోంచి ఓ కాగితం తీసి ఆమె కందించాడు.

రూపాయికాగితం సైజులో వుందది. అందులో ఎర్ర సిరాతో లావుగా గుండ్రంగా "ప్రేమిస్తే చంపేస్తా!!" అని మాత్రం వ్రాయబడుంది. అంతకుమించి మరేమీ లేదు!

ఆ అక్షరాలని చదవగానే కాంతిరేఖ భృకుటి ముడి వడింది. తనకేమీ అర్థంకాలేదన్నట్టుగా జలంధర్ వేపు చూసింది. "డిటెక్టివ్ గారూ! ఏమిటిది?!!

"ఇది మీకెలా వచ్చిందో మీకే తెలీదా?"

"నిజంగా నాకు తెలీదు జలంధర్ గారూ! నన్ను నమ్మండి."

ఆమె ముఖంలోని అమాయకపు రేఖల్ని చూసి ఆమె నిజమే చెబుతోందని గ్రహించాడు జలంధర్. మరు క్షణంలో ఆయన ముఖంలో ఆశ్చర్యం చోటు చేసుకుంది.

"మీరు నన్ను హోటల్లో కలిసినప్పుడు అడ్వాన్సుగా వుంచుకోమని నాకు కొంత డబ్బిచ్చారు. గుర్తుందా?"

"వుంది."

"ఆ నోట్లలో ఈ కాగితం కలుపబడివుంది."

"ఆఁ!?"

"అవును. బాగా గుర్తు చేసుకోండి. ఆ డబ్బు మీరు యింటినుండి తీశారా లేక దార్లో ఎక్కడైనా పట్టుకొచ్చారా?"

"మా యింట్లో బీరువాలోంచి తీశాను. తీసేప్పుడు లెక్కబెట్టుకున్నాను. అలాంటి కాగితమేదీ లేదని స్పష్టంగా చెప్పగలను."

"దారిలో ఎవరైనా యివ్వటంకాని ఎవరినుండైన పుచ్చుకోవటం కాని జరిగిందా? బాగా గుర్తుచేసుకోండి."

ఒక్కక్షణం ఆలోచించింది కాంతిరేఖ. తర్వాత అప్రయత్నంగా 'టాక్సీ' అంది!

కుతూహలంగా కనుబొమలెగరేశాడు జలంధర్.

"జలంధర్ గారూ! మీవద్దకు టాక్సీలో వచ్చాను. మిమ్మల్ని కలవాలనే తొందర్లో నా బ్యాగ్ టాక్సీలోనే పెట్టి కారు దిగాను. నాలుగడుగులు వేశాక టాక్సీ డ్రయివరు నా దగ్గరకు పరుగెత్తుకొచ్చి బ్యాగ్ మర్చిపోయారంటూ నాకిచ్చాడు. ఆ సమయంలో..."

'అవు'నన్నట్టుగా తలపంకించాడు జలంధర్.

"టాక్సీ డ్రయివర్ కి తప్పితే అలాంటవకాశం మరెవ్వరికీ లేదు. మధ్యలో నేను బ్యాగ్ ఓపన్ చెయ్యనేలేదు."

"టాక్సీ డ్రయివర్ ముఖం కాని టాక్సీ నెంబరుగాని మళ్ళీ చూస్తే గుర్తుపట్టగలరా?"

నిస్సహాయంగా చూసిందామె డిటెక్టివ్ వైపు.

"సారీ. మీతో కలిసి మాట్లాడాలనేదే తప్ప నాకు మరో ధ్యాసే లేకపోయింది."

"నెవర్ మైండ్. ఈ పెట్టె మీదగ్గరికెలా వచ్చిందో చెప్పండి."

"మెషిన్ పార్ట్‌లోనే వచ్చింది."

"తలుపు దగ్గరుంచి సిగ్నలిచ్చి మీరొచ్చేలోగానే వెళ్ళిపోయారన్నమాట."

"అవును. గంటక్రితం కాలింగ్ బెల్ మ్రోగింది. తలుపు తెరిచాను. పెట్టె వాకిట్లో వుంది. ఎవరూ లేరు. ఏమిటోనని ఆత్రంగా చూశాను. అంతే. గుండె బ్రద్దలైంది జలంధర్ గారూ!" ఆమెలో దుఃఖం మళ్ళీ వెల్లుబికింది.

మౌనంగా శవపేటిక వేపు నడిచాడు జలంధర్. తలుపు తెరిచి తదేకంగా శవాన్ని చూశాడు. శవం ముఖంలో ఏవిధమైన భావమూ లేదు.

శవాన్నంతా కలయజూస్తోన్న జలంధర్ కళ్ళు మెరిశాయ్. మెదడు చురుగ్గా పనిచేసింది. తన భావాలు బయటపడనీకుండా శవం జేబువేపు దృష్టి పోనిచ్చాడు. ఏదో కాగితంలాంటిది కన్పించింది. కర్చిఫ్‌తో మెల్లిగా దాన్ని బయటకి లాగాడు. అదో ఉత్తరం.

ఆత్రంగా మడతలు విప్పాడు.

"మిస్ కాంతిరేఖా!

ఏ ప్రేయసైనా తన ప్రియుడికోసం ప్రేమనే కాదు, అవసరమైతే ప్రాణాన్నే త్యాగం చెయ్యగలదు. అలా చేసే వ్యక్తే నిజమైన ప్రేయసి. నువ్వు కాదు. నువ్వు ప్రవీణ్‌ని ప్రేమిస్తున్నావని నాకు తెల్సు. మీ పెళ్ళి జరగటం నాకిష్టంలేదు. అందుకే అతన్ని మాయం చేశాను.

నీకు డిటెక్టివ్‌ని సాయంకోరేంత తెలివుందని నాకు తెలీదు. అక్కడికి సెకాన్డ్ఫ్రది మూమెంట్‌లో నిన్ను

హెచ్చరించాను. నా హెచ్చరికని కూడ నిర్లక్ష్యం చేశావ్. డిటెక్టివ్ సాయం కోరావ్. అందుకే నా మాట చెల్లించుకోక తప్పలేదు. నీ ప్రవీణ్ ని నీ కప్ప గిస్తున్నాను. అయితే అతని ప్రాణం మాత్రం తీసుకున్నాను.

యిక నువ్వు యధేచ్ఛగా అతన్ని ప్రేమించవచ్చు. పరిశోధన మానమని డిటెక్టివ్ ని హెచ్చరించు. లేకపోతే తర్వాతి వంతు నీదికాదు. మీ అమ్మది...!"

క్రింద సంతకం లేదు!!

ఆమె చేతికిచ్చాడు జలంధర్ ఆ వుత్తరాన్ని. చదివితే మరింత బాధపడుతుంది. అయినా తప్పదు.

"...జలంధర్ గారూ! మా అమ్మను మీరే కాపాడాలి..." చేతులు జోడిస్తూ అర్ధిస్తున్నట్టుగా అంది కాంతిరేఖ. భయంవల్ల ఆమె ముఖంనిండా స్వేదబిందువులు అలముకున్నాయ్.

"...ఇలా రండి..." ఆమె మాటల్ని మధ్యలోనే త్రుంచివేస్తూ శవ పేటిక దగ్గరగా తీసుకుపోయాడు జలంధర్. శవం చెవిక్రింద చేత్తో తడిమి ఒక్కసారిగా చేతిని చురుగ్గా వెనక్కి తీసుకొచ్చాడు.

మరుక్షణం కాంతిరేఖ కళ్ళు ఆశ్చర్యంతో రెపరెప కొట్టుకున్నాయ్.

చేతిలోకి వూడివచ్చిన మాస్క్ ని పక్కన పెడుతూ అన్నాడు జలంధర్. "ప్రవీణ్ చావలేదు. ఎవరోన్ని చంపి మాస్క్ తొడిగి ప్రవీణ్ లా మేకప్ చేసి పంపించారు. అంటే ప్రవీణ్ తో వాళ్ళకేదో అవసరం వుంది. అతన్ని మీరు పెళ్ళిచేసుకుంటే వాళ్ళ అవసరం

తీరదు. అందుకే యిలా మిమ్మల్ని నమ్మించి మీకు దూరంచేసి వాళ్ళకి దగ్గరయ్యేలా చేసుకున్నారు. ప్రవీణ్ ఎక్కడో సురక్షితంగా వున్నాడు."

కాంతిరేఖ ముఖంలో కాంతిరేఖలు వెల్లివిరిశాయ్.

"అన్నట్టు మీ అమ్మగారెక్కడ? ఆవిడగారి పరిస్థితెలావుంది?"

ఆనందాశ్రువుల్ని కర్చీఫ్‌తో తుడుచుకుంది కాంతిరేఖ. "అమ్మ పరిస్థితిలో ఏ మార్పూ రాలేదు. కాని ఆమె అలవాట్లలో చాల మార్పు వచ్చింది. ఎప్పుడూ దేవుడి పటంముందు కూర్చుని కన్నీరు కారుస్తూవుంటుంది. రోజూ రెండు మూడు గుళ్ళకి వెళ్ళి అభిషేకాలు చేయిస్తోంది. ఈ రోజూ వెళ్ళింది. జలంధర్ గారూ! మా అమ్మకే ప్రమాదమూ రాదుగదా!"

"ఎందుకైనా మంచిది. ఎవరైనా తోడు పంపిస్తూండండి. హైండ్రెడ్ పర్సెంట్ అలాంటిదేదీ జరగదనే అనుకుంటున్నాను... మీ అమ్మగారొచ్చేసరికి యింకా ఎంత సేపవుతుంది?"

"నలభై నిమిషాలు పట్టొచ్చు."

"ఆలోగా శవాన్నిక్కడ్నుంచి పంపించేస్తాను. మీ అమ్మగారికివేవీ తెలీనివ్వకండి."

తలూపింది కాంతిరేఖ.

ఫోనువద్దకు నడిచాడు జలంధర్. ఏదో నంబరుకి డయల్ చేశాడు.

"హలో చక్రం! నేను జలంధర్ని మాట్లాడుతున్నాను. పావుగంటలోగా నువ్వు మఫ్టీలో యిక్కడికి రావాలి. ఇక్కడో పాడుగాటి పెట్టెవుంది. మామూలుగా దాన్ని

రిసీవ్ చేసుకో. ఓ ఫ్రెండ్‌లా ప్రవర్తించు యిక్కడి వాళ్ళతో. తర్వాతేం చెయ్యాలో తరువాత తెలుస్తుంది నీకు..." అడ్రస్ చెప్పి ఫోన్ పెట్టేసి కాంతిరేఖవయిపు తిరిగాడు.

"కాసేపట్లో క్రైంబ్రాంచ్ యినస్పెక్టర్ చక్రవర్తి యిక్కడికొస్తాడు. అతన్తో పంపించివెయ్యండి దీన్ని. ఆఁ...మరోమాట. ప్రవీణ్‌బాబు అధీనంలో వున్న మేనేజర్లు, యితరుల పేర్లు, వారి క్లుప్తవివరాలూ కావాలి నాకు. వీలైతే..."

"వారి ముఖాలు చూడకపోయినా అందరి పేర్లూ తెలుసు నాకు. ఆఫీసుపనుల్లో అప్పుడప్పుడూ ప్రవీణ్‌కి సాయపడుతూండేదాన్ని. మీ యింటికి వచ్చి అందచేస్తాను."

"థాంక్స్...వస్తాను..."

శవపేటికవేపు జాలిగా చూసింది కాంతిరేఖ.

"పాపం! ఎవరో పూర్ ఫెలో..." అంటూ అక్కడి నుండి బయటకొచ్చాడు డిటెక్టివ్. ఆలోచనల్లో అప్పటి వరకూ సిగరెట్ కాల్చాలనే ఆలోచనకూడ రాలేదు. జేబులోంచి రెడ్‌విల్స్ పాకెట్ తీసి సిగరెట్ వెల్గించుకొని ఘాటుగా దమ్ము లాగాడు.

డ్రాయిలో కూర్చుని స్టార్ట్ చేశాడు. రెండు నిమిషాల్లో కారు కాంతీసదన్ కాంపౌండ్ దాటి రోడ్డుమీదికి తిరిగింది.

"...హాయ్యాండ్సమ్ మైడియర్...ఓవ్...సారీ! డ్రయివ్ చేస్తున్నావ్ కదూ! అబిడ్‌రోడ్డుకాద్దు. యిటుప్రక్క పోనీవ్!!!" అన్న కోమలమైన స్వరంతోపాటు వీపుకి

గ్రుచ్చినట్టుగా ఏదో అనింది.

అది పిస్తోలు మొన అని గ్రహించటానికి డిటెక్టివ్ కి ఒక్క క్షణం చాలు!

పరధ్యానంగా కారెక్కినందుకు మొదటిసారిగా నొచ్చుకున్నాడు డిటెక్టివ్ జలంధర్.

4

"వీల్లేదు!" గట్టిగా అరిచాడు ప్రవీణ్. "మీరు చెప్పినట్లు చెయ్యటం నావల్ల కాదు!"

రెండు మూడు రోజుల్నుండి సరిగా తిండిలేదేమో! మనిషి చిక్కి నీరసంగా కన్పిస్తున్నాడు ప్రవీణ్.

మృదువుగా నవ్వాడు ముసుగు మనిషి. "అవుతుంది మిస్టర్ ప్రవీణ్! ఏనాటికైనా మళ్ళీ మీ కాంతిరేఖని చూడాలనుకుంటే నే చెప్పినట్లు మీరు వినాల్సిందే. లేక పోతే మీ జీవితంలో ఎప్పటికీ కాంతిరేఖ ప్రసరించదు!"

"అంటే...?"

"వెరీ సింపుల్! మిమ్మల్ని ప్రాణప్రదంగా ప్రేమిస్తోన్న కాంతిరేఖ మిమ్మల్నే కాదు, ఈ లోకాన్నే వదిలిపెట్టి వెళ్ళిపోతుంది!!"

"మీ మనుషులు ఎవర్నో హత్యచేస్తోంటే చూసింది నేను! ఆ రహస్యం నావల్ల బయటపడుతుందనే భయం వుంటే నన్ను చంపెయ్యండి. ఆ పిల్లేం చేసింది?" కోపంగా అన్నాడు ప్రవీణ్.

"నిన్ను చంపాలనుకుంటే అది క్షణాలమీద పని మిస్టర్ ప్రవీణ్ బాబూ! నీ కిదివరకే చెప్పాను. మేం భారీ ఎత్తున ప్రారంభించబోతోన్న కొత్త స్మగ్లింగ్ ఏజెన్సీకి నీవంటి సమర్థుడైన మేనేజర్ కావాలి! నువ్వు

తప్పితే ఆ పని మరెవ్వరూ చెయ్యలేరు. ఆ విషయం నేను స్వయంగా తెల్సుకున్నాను.

నిన్ను చంపటానికొచ్చాడు నిన్నిక్కడికి తెచ్చింది. మా కంపెనీ నీ ఆధ్వర్యంలో నడపబడాలి. కోరి పిల్లనిస్తా మన్నా వుద్యోగం లేందే వద్దనుకునే ఈ రోజుల్లో కోరి వుద్యోగం యిస్తానంటే కాదనకు. త్రివిక్రమరావు నీకు మహా యిస్తే వెయ్యో రెండువేలో యివ్వొచ్చు నెలకి. కాని నేను పదివేలిస్తాను. యింకా కావాలిస్తే ఎంత కావాలిస్తే అంత యథేచ్ఛగా వాడుకోవచ్చు నువ్వు. లేదు–షేర్ కావాలా? తీసుకో. సిరిరామోకాలొడ్డకు!''

నవ్వాడు ప్రవీణ్. "నాకు డబ్బుమీద ఆశ లేదు మిస్టర్!''

"కాంతిరేఖమీద వుందంటావ్. కాని ప్రవీణ్! కాంతి రేఖని మించిన అందగత్తె లెందరో మా ఏజన్సీలో వున్నారు. వాళ్ళందర్నీ నువ్వు వాడుకోవచ్చు. అంతే కాదు. యింకా నువ్వెవర్నైనా కోరితే మరుక్షణం నీ ముందుంచటానికి మనవాళ్ళెప్పుడూ రెడీయే! యింకా ఏం కావాలి నీకు?''

"పరువు! మంచితనం!! ఆత్మగౌరవం!!!''

"హ హహ హ!'' వికటంగా నవ్వాడతను. "పరువు, మంచితనం, ఆత్మగౌరవం! ఈ మూడూ కల్సినా నీకు మూడు మెతుకులు కూడు పెట్టలేవు ప్రవీణ్! అసలీ కాలంలో ఆ పదాలకి అర్థమే లేదు. మొదట అందరూ అలా చెప్పేవారే!''

"నా కూటికి ప్రస్తుతం లోటేమీ లేదు మిస్టర్! నా కొచ్చే జీతం నా జీవితం గడవటానికి సరిపోతుంది,

ప్రస్తుతం నాకే కరువూ లేదు. ఎప్పుడో రాబోతుందని పరువును అమ్ముకోలేను. అయాం వెరీ సారీ."

"సారీ అంటే ప్రయోజనంలేదు. నీకోసం మా మనిషి నొకణ్ణి పోగొట్టుకున్నాను. వయసు, ఎత్తు, బరువు దాదాపు నీతో సమానంగా వున్న మా మనిషి నొకణ్ణి చంపి నీ రూపంలో కాంతిరేఖకి ప్రజెంట్ చేశాను. త్వరలో ఆమె మరొకర్ని పెళ్ళిచేసుకోవచ్చు. లేదా సినిమాలోలా 'నీవు లేని జీవితం వృథా' అని డైలాగ్ చెప్పుకొని ఆత్మహత్య చేసుకోవచ్చు. సో, డోంట్ థింక్ అబౌట్ హర్. థింక్ అబౌట్ యువర్ బ్రైట్ ఫుల్ ఫ్యూచర్."

ఆ మాటలు వినగానే ముఖం చిట్లించుకున్నాడు ప్రవీణ్. ఆ వ్యక్తిపై అతనికి విపరీతమైన అసహ్యం కలిగింది. సాటి మనిషిని తన స్వార్థంకోసం నిర్దాక్షిణ్యంగా బలిచేశాడు. అటువంటి వాణ్ణి 'రాక్షసుడు' అంటే చాలా? ఊహూం...చాలదు.

"నా అభిప్రాయం తెల్సుకోకుండా నువ్వాపని చేస్తే అందుకు బాధ్యుణ్ణి నేనుకాదు. నేను హత్యాదృశ్యాన్ని చూసినట్టుగా ఎవరితోనూ చెప్పను. నన్నొదిలెయ్. చెబుతానని అనుమానం, భయం వుంటే చంపెయ్."

"నీ నిర్ణయం మారదా?"

"మారదని చివరిసారిగా చెబుతున్నాను." ప్రవీణ్ కంఠం దృఢంగా పలికింది.

ఆ వ్యక్తికి అరికాలి మంట నెత్తికెక్కింది. కోపంతో వూగిపోయాడు.

"నిన్నెలా ఒప్పించాలో మాకు తెలుసు. మాట వింటావని మాటల్తో ప్రయత్నించటం పొరపాటు" అంటూనే

రెండుసార్లు చప్పట్లు కొట్టాడు.

మరుక్షణం యిద్దరు గూండాల్లాంటి యువకులు ప్రత్యక్షమయ్యారా గదిలో.

“మిస్టర్ ప్రవీణ్ బాబూ!” కటువుగా పలికిందతని స్వరం. నేనూ చివరిసారిగా చెబుతున్నాను. నీకు ఒక్క గంట మాత్రమే గడువివ్వబడుతోంది. ఈలోగా మరోసారి ఆలోచించుకో. ఒప్పుకోకపోతే నీకు బ్రెయిన్ వాష్ చేయించటం అంత కష్టమైన పనేం కాదు. ఆతర్వాత నువ్వే ‘ఆర్డర్ బాస్!’ అంటూ నాచుట్టూ తిరుగుతావు.

ఈ రోజు సాయంత్రం మా సైంటిస్టులు ప్లాస్టిక్ సర్జరీ ద్వారా నీ ముఖాన్ని పూర్తిగా మార్చేస్తారు. మా కంపెనీలో వున్న నిన్ను ఎవ్వరూ ప్రవీణ్ గా గుర్తించలేరు. ఆఖరుకి నీ కాంతిరేఖకూడ! నీ నిశ్చయాన్ని తెలియజెయ్యటానికి అంతకంటె అవసరంలేదు. ఒప్పుకుంటే నీకు కొన్ని శారీరక బాధలూ మాకు కొంత శ్రమా తప్పుతాయి.”

ముసుగుమనిషి ఆ గూండాలవేపు తిరిగాడు. “ఇతన్ని తీసికెళ్ళి మన సీక్రెట్ సెల్ లో బంధించండి” అన్నాడు.

“ఆర్డర్ బాస్!” అన్నారు వాళ్ళు వినయంగా.

5

“ఇంకా ఎంతదూరం?” విసుగ్గా అన్నాడు జలంధర్.

“నేను ఆపమని చెప్పేవరకూ” అందామె.

మవునంగా కారు డ్రయివ్ చెయ్యసాగాడు జలంధర్. కారు వేగంగా పరుగుతీస్తోంది. అప్పటికే వాళ్ళు పది మైళ్ళకి పైగా ప్రయాణం చేశారు. ఇంకా ఎంతదూరం పోవాలి? అసలు తను కాంతిరేఖ దగ్గరికెళ్ళినట్టు ఈమెకెలా తెల్సింది? తనని ఎక్కడికి తీసికెడుతోంది? తమ

స్థావరానికా? ఈమె సెలాగో బోల్తా కొట్టించాలి. ఎలా?

జలంధర్ మెదడు చురుకుగా పనిచేసింది. మెరుపు లాంటి ఆలోచన మస్తిష్కంలో మెదిలింది. అవకాశం కొరకు ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

"లెఫ్ట్...!" అందామె. అప్పట్నుంచీ మలుపు తిరగాల్సిన చోటల్లా అలా యిన్స్ట్రక్షన్స్ యిస్తోనే వుంది.

ఫోర్ రోడ్స్ సెంటరది.

ఆ రోడ్డుమీద జనసంచారం అంతగా లేదు. లెఫ్ట్ కి త్రిప్పబోతూ ఒక్కసారిగా రైట్ కి త్రిప్పాడు జలంధర్. వెంటనే సడన్ బ్రేక్ వేశాడు.

ఎదురుచూడని ఆ హఠాత్పరిణామానికి ఆమె తెల్ల బోతూ తూలి ఎడమవేపు సీటుపై పడిపోయింది. అలా పడిపోతూనే ట్రిగ్గర్ నొక్కేసింది అప్రయత్నంగా.

కాని ఆమె పడిపోవటంతో రివాల్వర్ వున్న చెయ్యి కిటికీవేపుకి తిరిగుండటంమూలాన బుల్లెట్ కిటికీగుండా దూసుకుపోయింది. అది సైలెన్సర్ అమర్చింది కావటంతో ఆ కాస్త శబ్దమూ కారులోపలే వుండిపోయింది.

డిటెక్టివ్ బ్రేక్ వెయ్యటం, రివాల్వర్ వున్న ఆమె చేతిని తనచేత్తో నొక్కటం, ఆ బాధకి తట్టుకోలేక ఆమె రివాల్వర్ని జారవిడవటం - అంతా క్షణాల్లో జరిగి పోయింది.

"ఎవరు నువ్వు? ఎక్కడికి తీసుకుపోతున్నావ్? నిన్నిలా చెయ్యమని చెప్పిందెవరు? మీ రహస్య స్థావరం ఎక్కడ? ఎవరు మీ బాస్...?" కటువుగా ప్రశ్నించాడు జలంధర్.

అన్ని ప్రశ్నలకీ జవాబుగా ఆమె తల వాల్చేసింది!

ఉలిక్కిపడి ఆమె మీదకి వంగి చూశాడు. ఆమె తొడపై పిన్‌తో గ్రుచ్చిన చిన్న గాయం వుంది. ఎడం చేతి చిటికెన వ్రేలికి పదునైన మొనగల ఎర్ర రాయి పొదగబడిన వుంగరం వుంది!

అంటే...అందులో సైనేడ్ వుందన్నమాట!!

గాఢంగా నిట్టూర్చి ఆమెనోసారి పరిశీలించాడు జలంధర్. వయసు యిరవై వుండొచ్చు. తెల్లగా వుంది. అందమైన ముఖం. బాబ్డ్ హెయిర్. ఎరుపురంగు మినీ స్కర్టు. మోకాళ్ళవరకూ సాక్స్, పాదాలకు బూట్సు. ఎడంచేతిలోని హ్యాండ్ బ్యాగ్ క్రిందకి వ్రేలాడి అటూ ఇటూ వూగుతోంది.

నెమ్మదిగా దాన్నందుకొని ఓపన్ చేశాడు. లోపల కాస్మటిక్ గూడ్స్‌తోపాటు ఓ వంద రూపాయల నోటుంది. దానిపై అశోకచక్రం కన్పించే తెల్లని ఖాళీ స్థలంలో EE అన్న అక్షరాలతోబాటు 'హోటల్ కల్పన' అని మాత్రం రాసుంది!

శవాన్ని చేర్చవలసిన చోట చేర్చి తిరిగి కారులో బయల్దేరాడు డిటెక్టివ్ జలంధర్.

నెమ్మదిగా పరుగుతీస్తోంది డాడ్జి. ఆయన మస్తిష్కంలో ఆలోచనలు చోటు చేసుకుంటున్నాయ్. ముఖం గంభీరంగా వుంది. పెదవుల మధ్య రెడ్ విల్స్ ఎర్రగా కాలుతోంది.

'హోటల్ కల్పన' అని వందరూపాయల నోటుమీద రాసుంది. మరి EE అన్న అక్షరాలేమిటి? వీటిలో వున్న అంతరార్థమేమిటి? హోటల్ కల్పనకీ వీళ్ళకీ సంబంధం ఏమిటి?

ఏదో ఆలోచన ఆయన బుర్రలో మసకగా మెదిలింది. మరుక్షణం మెరుపులా మెరిసింది. 'అవును దీనిలోని అర్థం యిదే! E అంటే ఈవెనింగ్. అల్ఫాబెట్స్‌లో అయిదవ అక్షరం E! అంటే మొదటి అక్షరానికి సాయంత్రం అని, రెండవ అక్షరానికి 5 అని అర్థం!!'

'సాయంత్రం అయిదు గంటలకి హోటల్ కల్పనలో ఏదో జరగబోతోంది!'

హుషారుగా మరో సిగరెట్ వెలిగించుకున్నాడు జలంధర్. టైమ్ చూసుకున్నాడు. యింకా చాలా వుంది. ఈలోగా ఏం చెయ్యాలి?

కాంతిరేఖ మెదిలింది తన మనసులో. తన అనుమానం కూడ తీర్చుకోవచ్చు.

6

ఐదు గంటలైంది.

హోటల్ కల్పన చాల సందడిగా వుంది. డిటెక్టివ్ జలంధర్ ఓ కుర్చీలో మౌనంగా విస్కీ చప్పరిస్తూ కూర్చున్నాడు. వ్రేళ్ళమధ్య సిగరెట్ పొగలు గ్రక్కుతోంది.

ఆయన కళ్ళు హోటల్ అంతా కలయజూస్తూ అందరి మొహాల్ని చదివేస్తున్నాయి.

ఎవరూ ఎవర్నీ పట్టించుకోటంలేదు. ఎవరి ఆనందంలో వాళ్ళున్నారు. అందరి దృష్టి స్టేజిపైనే వుంది.

స్టేజిపైన ఓ యువతి, ఓ యువకుడు ఫారిన్ మెథడ్స్‌ని అనుకరిస్తూ డాన్స్ చేస్తున్నారు.

డిటెక్టివ్ జలంధర్ కూడ ఓసారి స్టేజివంక చూశాడు వారిద్దరి డాన్స్ చూస్తోంటే అతనికే ముచ్చటేసింది.

సభ్యతాబద్ధులై క్లాసికల్‌గా అడుగులేస్తున్నారు వాళ్ళు.

అప్పుడప్పుడూ ఆ హాల్లో క్లాప్స్ మార్మోగుతున్నాయి.

తిరిగి జనంవేపు దృష్టి పోనిచ్చాడు.

తినేవాళ్ళు తింటోన్నారు. తాగేవాళ్ళు తాగుతోన్నారు. కొందరు వుత్సాహవంతులైన యువతీ యువకులు జంటలుగా స్టేజీపైని జంటతో జతగా హాల్లో డాన్స్ చేస్తోన్నారు.

'సర్...' అన్న పిలుపు విని ఉలిక్కిపడి చూశాడు జలంధర్. ఆ హోటల్లో పనిచేస్తోన్న ఓ లేడీ సర్వర్!

ఏమిటన్నట్టు చూశాడు జలంధర్.

"ఈ స్లిప్ మీకందజెయ్యమన్నారు." అతని చేతిలో ఓ కాగితముక్క వుంచిందామె.

తీసి చూశాడు.

"ప్రే... హెల్ప్... మీ!—కాంతిరేఖ."

టెలిగ్రాఫ్ భాషలో వుందా ఉత్తరం!

జలంధర్ మొహంలో రంగులు మారాయి. 'ఎందుకొచ్చింది కాంతిరేఖ యిక్కడికి? లేక దార్లోనే బంధించి తీసుకొచ్చారా?...కాంతిరేఖ తన క్లయింట్. ఆమెకే అపాయమూ రాకుండా కాపాడాలి!' ఒక్కొక్క ఆలోచన కనుగుణంగా ఆయన ముఖ కవళికలు మారుతున్నాయి.

"ఎక్కడున్నారు వీరు?" ఆత్రంగా అడిగాడు.

"రండి. చూపిస్తాను..." దారి తీసిందామె. అనుసరించాడు జలంధర్ జేబులోంచి రెడ్‌విల్స్ పాకెట్ తీస్తూ.

ఆ హాల్లోంచి మరో హాల్లో ప్రవేశించిందామె. అందులో ఎవరూ లేరు. గోడమీదవున్న ఓ మీట నొక్కింది. నేలమీద ఓ వృత్తాకారం గల పలక ప్రక్కకు తప్పుకొని సొరంగమార్గం ఏర్పడింది. లోపల మెట్లున్నాయ్!

సిగరెట్ ప్యాక్ చేతో పట్టుకొనే ఆమె వెనక నడిచాడు జలంధర్. వెనక ద్వారం తిరిగి మూసుకు పోయింది.

"ఈ సహాయం చేస్తానన్నందుకు కాంతిరేఖ నీ కెం తిస్తానంది?"

"రెండు వేలు."

"స్మగ్లింగ్ గ్యాంగ్ నాయకుడెవరో చెప్పు. నేను అయిదు వేలిస్తాను."

"అమ్మో! ఆ రహస్యం బయటపెడితే నా ప్రాణం పోతుంది."

అప్పటికే వాళ్ళిద్దరూ సొరంగ మార్గం దాటి ఓ విశాలమైన గదిలో అడుగుపెట్టారు.

"నీ ప్రాణానికి నేను హామీ యిస్తున్నాను. భయం లేదు. చెప్పు."

"ముందు మీ ప్రాణాలకి హామీ యిచ్చేవాళ్ళెవరో ఆలోచించుకోండి మిస్టర్ జలంధర్!" మెరుపులా వెనక్కి తిరిగి చేతిలోని రివాల్వర్ డిటెక్టివ్ కేసి గురి పెడుతూ అందా అమ్మాయి!!

"చింత చచ్చినా పులుపు చావలేదు..." వ్యంగ్యంగా అంటూ ప్రత్యక్షమయ్యాడు ముసుగుమనిషి. "మా స్థావరంలో ప్రవేశించి మా మనిషి ప్రాణాలకే హామీ యిస్తు

న్నావే! ఎంత ధైర్యం నీకు?"

"నీ మనుషుల ఎదుటే తలెత్తుకు తిరగలేక ముసుగేసు కున్న నువ్వు ధైర్యం గురించి మాట్లాడుతున్నావా?" హేళనగా అన్నాడు జలంధర్.

ఆ మాటలు విన్పించుకోలేదు ముసుగుమనిషి.

"మా సంస్థ నిబంధనల్లో అప్పగించిన పని చెయ్యలేక, కారణం తెలియజెయ్యక పూరుకుంటే ఆ మనిషి మరణించి నట్టే లెక్క. రీటాగురించి తెలియకపోయేసరికి ఆమె నీకు చిక్కి ప్రాణాలు కోల్పోయి వుంటుందని వూహించాను. ఆమె దగ్గరున్న వందరూపాయల నోటుద్వారా నీకు ఈ హోటల్ అడ్రస్ తెల్సిపోయింది.

"అందుకే ప్రవీణ్ కి బ్రెయిన్ వాష్ చెయ్యటం కోసం ఈ రోజిక్కడ మా సైంటిస్ట్ లు జరపబోయే సమావేశాన్ని వాయిదా వేశాను. నువ్వొస్తావని తెల్సు నాకు. అందుకే కాంతిరేఖ ఆపదలో వుందని తెలియజేస్తున్నట్టు తెలివిగా స్లిప్ పంపించి నిన్ను రప్పించాను."

"రీటాలాంటి రివటలూ నీలాంటి చవటలూ ఎంత తెలి విగా ప్రవర్తించినా చట్టంనుండి తప్పించుకోలేరుమిస్టర్!"

"అసలు మీ రిక్కడ్నుంచి ఎలా తప్పించుకుంటారో చూస్తాను..." వికటంగా నవ్వుతూ చప్పట్లుకొట్టాడు ముసుగుమనిషి. బిలబిలమంటూ ఐదారుగురు ప్రవేశించారు. "ఇతనికీ ప్రవీణ్ కి పట్టిన గతి పట్టించండి" గర్జించాడు.

చేతులెత్తి నిలబడిన జలంధర్ ని ప్రవీణ్ ప్రక్కనే వున్న మరో స్తంభానికి కట్టిపడేశారు వాళ్ళు.

7

"మీమీ యిష్టదైవాల్ని స్మరించుకోండి." లేడీ సర్వర్ నుండి రివాల్వర్ తీసుకొని, తన జేబులోంచి మరో రివా

ల్వార్ తీసి రెండు రివాల్వార్‌లు యిద్దరికీ గురిపెడ్తూ కర్క శంగా అన్నాడు ముసుగుమనిషి.

"...ఆ పని చెయ్యాల్సింది నువ్వు మిస్టర్!!" అన్న సింహ గర్జనతోబాటు నిశ్శబ్దంగా వెలువడిన రెండు బుల్లెట్లూ ముసుగుమనిషి చేతుల్లోని రివాల్వర్లని ఎగర గొట్టేశాయి!!

ఉలిక్కిపడి ప్రక్కకి చూశాడు ముసుగుమనిషి.

ఎదురుగా పోలీసులు! డిటెక్టివ్ యిన్స్‌పెక్టర్ చక్ర వర్తి చేతిలోని సైలెన్సర్ అమర్చిన పిస్తోలు యింకా సన్నగా పొగలు విరజిమ్ముతూనే వుంది!

"ఊఁ...ప్రవీణ్ కట్లూ నాకట్లూ విప్పండి. లేకపోతే ఇన్స్‌పెక్టర్ చేతిలోని పిస్తోలు మీ నాయకుణ్ణి హత్య చేస్తుంది... ఏం నాయకా? ఎలా వుంది మన తెలివి? తుపాకీ తూటాలా లేదూ!!" పరిహాసంగా అన్నాడు జలంధర్.

ముసుగుమనిషి ఆ మాటలు యాంత్రికంగా వింటు న్నాడు. శిలా ప్రతిమలా నిల్చుండిపోయాడు. పోలీసులు అతనిని, అతడి అనుచరులను క్షణాలలో అదుపులోకి తీసు కున్నారు.

బంధవిముక్తుడై హుషారుగా ఒళ్ళు విరుచుకున్నాడు జలంధర్.

"శాంతిరేఖ బంధించబడలేదని నాకు తెల్సు. లేడీ సర్వర్ స్లిప్ తెచ్చివ్వగానే యిది నీ పథకమేనని తెల్సి పోయింది. అయినా అనుమానం రాకుండా శాంతిరేఖ బంధించబడినందుకు బాధపడ్డట్లు నటించి, ఆత్రత కన పరుస్తూ ఆమె వెనక నడిచాను. నడుస్తూ నడుస్తూ నా

సిగరెట్ పాకెట్‌లోంచి ఒక్కొ సిగరెట్టూ టర్నింగ్ పాయింట్స్ వద్ద పడేశాను. ఆ గుర్తుల్నిబట్టి నా వాళ్ళు ఈ స్థలం కనిపెట్టగలిగారు. అదీ సంగతి యిప్పుడర్థ మైందా?"

జవాబివ్వలేదు ముసుగుమనిషి.

"ఏడుస్తున్నావో నవ్వుతున్నావో తెలీటం లేదు. యింకా ఆ ముసుగెందుకు తీసేయ్!"

మరుక్షణం ముసుగుమనిషి 'ముసుగు' అతడి చేతుల్లోకి వూడి వచ్చింది.

"మైగాడ్! హతుడు!!" ఆశ్చర్యం పట్టలేక గట్టిగా అరచాడు అక్కడే వున్న ప్రవీణ్.

అర్థం కానట్టు చూశాడు డిటెక్టివ్ అతనివేపు.

"ఓ. యిరుకు సందులో యితన్ని చంపుతూండగా నా కళ్ళారా చూశాను సార్! యితన్ని హత్యచేస్తుంటే చూశాననే నన్ను పట్టి బంధించారు."

"ఓహో! ఈ హతుడే నీలాగ మేకప్ చేసి శాంతిరేఖకి పంపిన మనిషిని చంపిన హంతకుడన్నమాట! వేరే వాళ్ళయితే నువ్వు ముందు ముందు చూడొచ్చు. తనైతే ముసుగులో వుంటాడు గాబట్టి నువ్వు చూసే అవకాశం లేదు. అందుకే తనని చంపుతున్నట్టూ దాన్ని నువ్వు చూసినట్టూ సన్నివేశాన్ని కల్పించి నిన్ను బుట్టలో వేసుకున్నాడు."

"నన్ను పట్టుకోటానికింత నాటకం ఎందుకాడాడు?"

"అదే సస్పెన్స్ మరి...!" నవ్వుతూ ప్రవీణ్ వేపు చూసి పోలీసులవేపు తిరిగాడు జలంధర్. "డాన్సర్ ఎక్కడ?" అన్నాడు.

వెనకనుండి యింతకు ముందు స్టేజిపై డాన్సుచేసిన

యువతి, యువకుడు ముందుకొచ్చారు.

"బాబాయ్...!" గట్టిగా అంది డాన్సర్. ఆమెకళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి.

"అవును. మీ బాబాయి త్రినాధరావు యితనే..."

త్రినాధరావు ఆశ్చర్యపోయాడు. ఆమె ఎవరో తనని 'బాబాయ్' అని ఎందుకందో అతని కర్థంకాలేదు.

అది గమనించిన డాన్సర్ తన ముఖంమీది మాస్క్‌ని తొలగించేసింది.

"కాం...తి...రే...ఖ..." అస్పష్టంగా గొణిగాడు త్రినాధరావు!

కాంతిరేఖతోబాటు డాన్స్ చేసిన యువకుడు మేకప్ తుడుచుకున్నాడు.

"యితడు ప్రఖ్యాత డిటెక్టివ్ జలంధర్ గారి అసిస్టెంట్ శ్రీనివాస్ బాబాయ్!" అతన్ని పరిచయం చేసింది కాంతిరేఖ. త్రినాధరావు పట్ల అసహ్యంతో కోపంతో ఆమె ముఖం జేవురించింది.

ప్యాకెట్‌లో వున్న ఆఖరి సిగరెట్‌ని వెలిగించుకొని చెప్పటం ప్రారంభించాడు డిటెక్టివ్ జలంధర్.

"మిస్ కాంతిరేఖా! కలకత్తాలోవున్న మీ బాబాయిని ఈ పాత్రలో చూసేసరికి నీకు విపరీతమైన ఆశ్చర్యం కలిగింది కదూ! యితనే ఈ కేసుకంతటికీ మూలకారకుడు..."

"మీ తాతగారు మీ నాన్నగారికీ, యితనికీ, మీ అత్తగారికీ ఆస్తి సమానంగా పంచియిచ్చారు. త్రివిక్రమరావుగారు సక్రమమైన పద్ధతిలో తన ఆస్తిని వ్యాపారంలో పెట్టి కష్టపడి వృద్ధిచేశారు. కాని ఈ త్రినాధ

రావు మాత్రం అడ్డదార్లు త్రొక్కాడు. స్మగ్లింగ్ ముఠాలో చేరి క్రమేణా దానికి 'బాస్' అయ్యాడు. ఈ వూరు అతని బ్రాంచీ మాత్రమే. హెడ్డాఫీసు కల కత్తాలో వుంది.

"భర్త పోయిన మీ అత్తగార్ని ఆమె పదేండ్ల కుమారుడు శ్రీనాథ్‌ని చేరదీశాడు. ఆ తర్వాత తెలివిగా ఆమె ఆస్తిని తనపేర రాయించుకొని ఆమెని స్లో పాయి జన్‌తో హత్యచేశాడు. మామ పెంపకంలో అల్లుడు తాగుబోతుగా తయారయ్యాడు... కాదు, ఇతను తయారు చేశాడు. అతనికి నిన్నిచ్చి పెళ్ళిచేసి తనవద్ద వుంచుకొని మున్ముందు మీ ఆస్తినికూడ కాజెయ్యాలని ప్లాను వేశాడు.

"అందుకు మీ అమ్మగారి స్వంత తమ్ముడు ప్రతాప్‌ని చిన్నప్పుడే మాయం చేశాడు_ అతడు నిన్ను చేసుకో వచ్చనే భయంతో.

"ప్రతాప్‌ని చంపమని త్రినాథరావు తన నమ్మిన బంటు మాధవరావుకు అప్పగించాడు. మాధవరావు, త్రినాథరావుని గుప్పిట్లో పెట్టుకోవాలని అతన్ని చంపక కొంతకాలం పెంచి కొంతవరకు చదువు చెప్పించి తిరిగి మీ యింటికే చేర్చాడు 'ప్రవీణ్‌బాబు' అనే పేరుతో. ప్రవీణ్‌బాబు పెద్దయ్యాడు.

"ఏదో సందర్భంలో మాధవరావుని బెదిరించాడు త్రినాథరావు. మాధవరావు ఎదురుతిరిగి ప్రతాప్ బ్రతికే వున్నట్టు, ప్రవీణ్ అనే పేరుతో మీ యింటనే పెరుగుతున్నట్టు తెలియపరిచి త్రినాథరావు నోరు మూయించాడు. అంతేగాక మీ అమ్మగారికి కూడా

. అతనే మీ విషయాలు తెలిపాడు.

''ఫలితంగా మాధవరావు హత్య చెయ్యబడ్డాడు.

''నేను మీ అమ్మగారితో మాట్లాడాను. ఎంతో బలవంతం చేస్తే అసలు విషయం చెప్పారు. ప్రవీణ్ తన సొంత తమ్ముడేనని తెలియజేస్తూ ఈ విషయం ఎవరికీ తెలియనివ్వకనీ, అలా తెలియపర్చినా, ప్రవీణ్ కాంతిరేఖల పెళ్ళి జరిపించినా, యిద్దరి ప్రాణాలూ తీసేస్తానని ఆమెని బెదిరించారు మారుపేరుతో. అటు సొంత తమ్ముడు_ఇటు కన్న కూతురు. ఆమె ఎటూ చెప్పలేక పిచ్చిపట్టినదానిలా అయిపోయారు.

''ప్రవీణ్ మంచితనం చూసి అతనికి నిన్నిచ్చి చెయ్యాలనుకున్నారు మీ అమ్మ, నాన్న. అప్పటికింకా ప్రవీణ్ గతం తెలీదు. అంతకుముందే నిన్ను శ్రీనాథ్ కివ్వమని త్రినాధరావు అడిగాడు. సొంత చెల్లెలి కొడుకైనా అతడు తాగుబోతు కావడంతో నిన్ను అతని కివ్వటానికి మీ నాన్నగారు ఒప్పుకోలేదు.

''అందుకే ప్రవీణ్‌నీ ఓ స్మగ్లర్ గా తయారుచేసి, మీ నాన్నగారి దృష్టిలో పడేలా చెయ్యాలని యింత నాటకం ఆడాను. ప్రవీణ్ స్మగ్లరని తెలిస్తే అతనిపై మీ నాన్నగారికున్న సదభిప్రాయం కాస్తా తుడిచిపెట్టుకుపోతుంది. అతన్ని బయటికి గెంటేసి 'గుడ్డికంటే మే'లని, పెళ్ళైతే అతనే సర్దుకుపోతాడని అనుకొని మీ నాన్నగారు నిన్ను శ్రీనాథ్‌కిచ్చి చేస్తారని, ఒప్పుకోకపోతే నిదానంగా చెప్పి ఎలాగైనా ఒప్పించవచ్చని మీ బాబాయ్ యింత తతంగం జరిపించాడు...!'

త్రినాథరావు ముఖం అవమానభారంతో క్రిందికి వంగిపోయింది.

"యిదంతా నాకెలా తెల్సిందోనని అనుమానిస్తున్నావ్ కదూ! మాధవరావు కుటుంబం ఈ వూళ్ళోనే వుంది. అడ్రస్ తెల్సుకుని వెళ్ళాను. మాధవరావుని నీవు మట్టు బెట్టినా, అతని డైరీలో నీ గుట్టు దాచబడి వుండిందిన్నాళ్ళూ. అది యిప్పుడు బయటికొచ్చింది..." అన్నాడు డిటెక్టివ్ జలంధర్ గంభీరంగా.

—: ఐ పో యిం ది :—